సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 26 । నవంబర్ । 2024




చకచకా సుందరీకరణ పనులు
కొత్తపల్లి జలపాతం వద్ద సుందరీకరణ పనులు చకచకా జరుగుతున్నాయి. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. 8లో

నృత్య వైభవం



భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని ప్రదర్శించిన ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు వారి సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పాయి. 8లో



అప్పన్నకు సహస్రనామార్చన
సింహాచలం :శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

ప్రతి విద్యార్థికి అపార్ కార్డు

- ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజని

పాడేరు: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) కార్డులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి గిరిజన విద్యార్థికి ఈ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, పాఠశాల రికార్డుల్లో ఉన్న పుట్టిన తేదీ ఒకే విధంగా ఉండేలా సవరణలు చేయాలని చెప్పారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 27వేల మంది విద్యార్థులకు ఈ నంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజని, 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి జల ప్రసాదం యూనిట్లు ప్రారంభం



అరకు పైనరి వద్ద రక్షిత మంచినీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి

డుంబ్రిగుడ/అరకులోయ టౌన్/అనంతగిరి(అరకులోయ రూరల్): పర్యాటక ప్రదేశాల్లో శుద్ధ జలాలను ప్రకృతి జల ప్రసాదం పేరుతో అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమని జిల్లా అటవీ శాఖ అధికారి పి.వి.సందీప్ రెడ్డి తెలిపారు. సుమారు రూ.29.50 లక్షలతో ప్రకృతి జల ప్రసాదం నీటి శుద్ధి యంత్రాలను అరకులోయ అటవీ శాఖ కార్యాలయం, డుంబ్రిగుడ మండలం అరకు పైనరీ ఉద్యానవనం, మరదగుడా ఎకోటూరిజం కార్యాలయం, అనంతగిరి మండలం చిలకల గెడ్డ ఎకో పార్క్‌లలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఆ యూనిట్లను ప్రారంభించిన సందీప్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా అరకులోయ వంటి పర్యాటక కేంద్రాల్లో మొట్టమొదటి సారిగా శుద్ధ నీటి జలాలను ప్రకృతి జలప్రసాదం పేరుతో అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయమన్నారు. దివీస్ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. సంస్థ ఎండీ మురళీ, కె.దివి, అటవీ శాఖ అదనపు అధికారి ఉమామహేశ్వరి, రేంజ్ అధికారి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, పైనరీ మేనేజర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు



కుంతుర్ల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో పుష్పా జోసెఫ్

పెదబయలు: మండలంలోని కుంతుర్ల, వనకొత్తూరు పాఠశాలలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్టు ఎంఈవో పుష్పా జోసెఫ్ తెలిపారు. సోమవారం మారుమూల ఎంపీపీఎస్ కుంతుర్ల,బర్రెమామిడి,రాసగుప్ప పాఠశాలలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంతురలో ఇద్దరు, వనకొత్తూరులో ఒక ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఈ నెల 22న జరిగిన పెదబయలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఫిర్యాదు చేయడంతో ఆయా పాఠశాలలను సందర్శించి, విచారణ జరిపి వారికి మెమోలు జారీ చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు సక్రమంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని పాఠశాలల్లో నూరుశాతం హాజరు శాతం ఉండేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో సూచించారు.

రా..రమ్మని..

తెలి మంచు తెరలమాటున, మంచు ముత్యాల పల్లకిలో విహరిద్దామా..ప్రకృతి 'స్నో'యగాల జల్లుల్లో పులకించిపోదామా.. సూరీడే మరెక్కడా చూడని భూతల స్వర్గంలో పరవశించిపోదామా.. నేలమ్మ నొర్లెబెట్టే సౌందర్యాన్ని తనువంతా కళ్లై తిలకిద్దామా.. పాతాళాన్ని కనిపెడదామని, ఆకాశం పని పట్టేద్దామన్న ఆశతో ఉన్నారా...అయితే మరెందుకు ఆలస్యం...చలో ఆంధ్రా ఊటీ. ప్రకృతి ప్రేమికులందరూ ఆహ్వానితులే అంటూ అరకులోయ స్వాగతం పలుకుతోంది. పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో కొంగొత్త అందాలతో సందర్శకుల కోసం సిద్ధమవుతోంది.

- అరకులోయలో పర్యాటక సీజన్ ప్రారంభం
- టూరిస్టుల కోసం సిద్ధమవుతున్న రిసార్ట్స్, క్యాంపింగ్ టెంట్లు
- ముస్తాబవుతున్న లాడ్జీలు, హోటళ్లు



మయూరీ హిల్ రిసార్ట్

భూతల స్వర్గం.. అతిథులకు ఆహ్వానం



పానిరంగిని సమీపంలో ముస్తాబైన ప్రైవేట్ రిసార్ట్స్



అరకులోయలోని ఏపీ టూరిజం హరిత వేలి రిసార్ట్స్

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్రా ఊటీ అరకులోయ పర్యాటకులకు ఆతిథ్యం అందించేందుకు సిద్ధమవుతోంది. పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో ఇక్కడి ప్రకృతి అందాలు తిలకించేందుకు వచ్చే ప్రకృతి ప్రేమికులు బస చేసేందుకు అన్ని రకాల సౌకర్యాలతో రిసార్టులు, హోటళ్లు, క్యాంపింగ్ టెంట్లను నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగళూరు, తెలంగాణ రాష్ట్రాల పర్యాటకులతో పాటు దేశ, విదేశాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చే ప్రకృతి ప్రేమికులకు ఇక్కడి ప్రకృతి అందాలు, లోయలు, సెలయేళ్లు కట్టిపడేస్తాయి. శీతాకాలంలో దట్టంగా కురుస్తున్న మంచును, చక్కిలిగింతలు పెట్టే చలిగాలలను ఆస్వాదిస్తూ టూరిస్టులు పులకించిపోతారు.

30 మందికి అనుమతి



అరకులోయ పరిసరాల్లో క్యాంపింగ్ టెంట్ల నిర్వహణకు ఇప్పటి వరకూ దరఖాస్తు చేసిన 30 మందికి అనుమతి ఇచ్చాం. క్యాంపింగ్ టెంట్ల నిర్వాహకులు తప్పని సరిగా పర్యాటకుల ఆధార్ కార్డుతో వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి. టెంట్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు, పార్కింగ్ స్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. రాత్రి 10 గంటల తర్వాత అధిక శబ్దంతో మ్యూజిక్ పెట్టి స్థానికులను ఇబ్బంది పెట్టరాదు. టెంట్ల ధరల పట్టిక విధిగా ప్రదర్శించి, పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశాల ప్రకారం అద్దె వసూలు చేయాలి.
– అడపా లవరాజు, ఎంపీడీవో, అరకులోయ.

రిసార్టులు, క్యాంపింగ్ టెంట్లు

అరకలోయలో పర్యాటకుల కోసం లాడ్జీలు, రిసార్టులు, క్యాంపింగ్ టెంట్లు, ఏపీ టూరిజం అతిథి గృహాలు సరికొత్త హంగులతో సిద్ధమయ్యాయి. ఏటా నవంబర్ మొదటి వారంలో పర్యాటక సీజన్ ప్రారంభమవుతుంది. టెంట్‌ల నిర్వహణకు అనుమతులు రావడం ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడే ఏర్పాటు చేస్తున్నారు.

- పాడేరు ఐటీడీఏ పీవో అనుమతితో అరకులోయ పరిసర ప్రాంతాల్లో స్థానికులే అధిక సంఖ్యలో క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది 30 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ఇప్పటికి అనుమతి ఇచ్చారు.
- యూజర్ చార్జీల కింద ప్రతి టెంట్‌కు రూ.250 చొప్పున నిర్వాహకులు చెల్లించాలి. 10 టెంట్లకు రూ.2,500,.. 20 టెంట్లకు రూ. 5వేల చొప్పున డీడీ రూపంలో గానీ, అరకులోయ ఎంపీడీవో బ్యాంక్ ఖాతాలోగానీ నిర్వాహకులు చెల్లించాలి.
- ఒక్కో ప్రాంతంలో 10 నుంచి 20 వరకు టెంట్ల వరకూ ఏర్పాటు చేస్తారు. రెండు బెడ్‌ల టెంట్‌కు రోజుకు రూ.700, మూడు బెడ్‌ల టెంట్‌కు రూ.1,000, ఆరు బెడ్‌ల టెంట్‌కు రూ.1,800 చొప్పున టూరిస్టుల నుంచి నిర్వాహకులు వసూలు చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధీనంలో అరకులోయలో హరిత వేలి రిసార్ట్స్‌లో 36 గదులు, రెండు వీఐపీ షూట్‌లు, స్విమింగ్ పూల్, గోష్టి కాన్ఫరెన్స్ హాల్ అందుబాటులో ఉన్నాయి.
- మయూరి హిల్ రిసార్ట్స్‌లో 49 రూములు అందుబాటులో ఉన్నాయి.
- అనంతగిరిలోని ఏపీ టూరిజం హరిత హిల్ రిసార్టులో 28 గదులు, తైడా జంగిల్ బెల్స్‌లో 9 గదులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు రెస్టారెంట్ సౌకర్యం కూడా ఉంది. వెజ్, నాన్ వెజ్ ఆహారపదార్థాలు లభిస్తాయి.
- అరకులోయలో ప్రైవేటు లాడ్జీలు, హోటళ్లు, రిసార్టులు కలిపి మొత్తం 86 ఉన్నాయి. వీటిలో సుమారు 800 రూముల వరకు అందుబాటులో ఉన్నాయి. పర్యాటక శాఖ అతిథి గృహాలతోపాటు దాదాపు అన్ని ప్రైవేటు లాడ్జీలు, రిసార్టులకు ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం ఉంది.



అరకులోయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన క్యాంపింగ్ టెంట్లు

కమ్మేసిన పొగమంచు

- జి.మాడుగుల 11.9..
- డుంబ్రిగుడ 12.3..
- హుకుంపేట 13.0
- పెదబయలు 13.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు



చింతపల్లి సమీపంలో గల పెంటపాడు వద్ద కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి: జిల్లాలోని పలుప్రాంతాల్లో పొగమంచు కమ్మేసింది. ఉదయం 10 గంటల వరకూ దట్టంగా కురిసింది. సమీపంలో ఉన్నవి కూడా కనిపించనంతగా మంచు కప్పేసింది. శీతల గాలుల ప్రభావంతో చలితీవ్రంగా ఉంది. సోమవారం జి.మాడుగులలో 11.9, డుంబ్రిగుడలో 12.3, చింతపల్లిలో 13.2, హుకుంపేట 13, మినుములూరులో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, ఉష్ణోగ్రతల విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గత వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉంటున్నాయి.ఉదయం సాయంత్రం వేళల్లో చలి గాలులు అధికంగా వీస్తున్నాయి. లంబసింగికి వచ్చే పర్యాటకులు చలి మంటలు వేసుకుని రక్షణపొందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు చలితో ఇబ్బందులు పడుతున్నారు.



పాడేరు-జి.మాడుగుల రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

పి.యర్రగొండ, డుంబ్రిగుడ ఏకలవ్యలకు పతకాల పంట



పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది.

వై.రామవరం/డుంబ్రిగుడ: ఇటీవల అనంతగిరి ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో డుంబ్రిగుడ, వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. పి.యర్రగొండ ఏకలవ్య మోడల్‌రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా 19 మందికి బంగారు, వెండి, కాంస్య పతకాలులభించాయి.వీరిలో 15 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బురారామ్ భైరవ తెలిపారు. విద్యార్థులతోపాటు పీఈటీ ప్రశాంతకృష్ణ, ఉపాధ్యాయులు ప్రసాద్, సాగర్‌లను సోమవారం ప్రిన్సిపాల్ బురారామ్ భైరవ్ అభినందించారు. డుంబ్రిగుడ మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సుమన్ కుమార్‌సింగ్ తెలిపారు. 17 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్టు చెప్పారు. విజేతలను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ మురుగేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు సుమిత్‌దేశవాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హర హర మహాదేవ

- కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు
- కిక్కిరిసిన ఆలయాలు

సాక్షి,పాడేరు: పవిత్ర కార్తీకమాసం చివరి సోమవారం జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు శివాలయాలకు తరలివెళ్లి అభిషేకాలు జరిపారు. హరహర మహాదేవ శంభో అంటూ భక్తిపారవశ్యంతో పూజలు చేశారు. బొర్రాగుహలు, కాశీపట్నం, అరకులోయలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వర స్వామి,పాడేరులోని ఉమానీలకంఠేశ్వర సమేత రాజరాజేశ్వరి ఆలయం,పాతపాడేరు,లగిశపల్లి,కలెక్టర్ బంగ్లా, వంజంగి,సంగోడి, గెడ్డంపుట్టు, తామరాపల్లి,తురాయిమెట్ట శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.మహిళలు కార్తీక దీపాలను భక్తి శ్రద్ధలతో వెలిగించారు.



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

భారీ అన్న సమారాధన

ఉమానీలకంఠేశ్వర సమేత రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగాణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడులు భక్తులకు భోజనాలు వడ్డించారు. అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.



అరకులోయలోని మల్లికార్జునస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పసుపు కుంకుమల పంపిణీ

పట్టణంలోని గౌరీపరమేశ్వరుల నెల రోజుల ఉత్సవాలలో భాగంగా గౌరీసేవాసంఘం ప్రతినిధులు మహిళలకు పసుపు,కుంకుమలను పంపిణీ చేశారు.పాడేరులోని అన్ని వర్గాల మహిళలు పసుపు,కుంకుమలను స్వీకరించారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోను పసుపు,కుంకుమ పంపిణీ చేశారు.

మెగా.. దగా



- మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై నీలినీడలు
- నిరుద్యోగులకు తప్పని ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో 734 ఖాళీల గుర్తింపు
- రోస్టర్ పాయింట్లు వెరిఫికేషన్ పేరిట తాత్సారం
- డీఎస్సీ కోసం పోస్టుల బ్లాక్, ఈ కారణంగా పదోన్నతులు కోల్పోతున్న టీచర్లు
- కూటమి ప్రభుత్వం రోజుకో ప్రకటనతో గందరగోళం

శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన ఇందిర భర్తతో పాటు విశాఖలో ఉంటోంది. ప్రైవేటు స్కూల్లో చేస్తున్న ఉద్యోగం మానేసి, విశాఖ వచ్చి ఆరు నెలలుగా డీఎస్సీకి సిద్ధమవుతోంది. ఇద్దరు పిల్లల్లో ఒకర్ని భర్త చూసుకుంటుండగా, చిన్నోడిని తల్లి వద్ద ఉంచేసి, ఎలాగైనా కొలువు సాధించాలని పట్టుదలతో చదువుతోంది. కానీ డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యమవుతుండటంతో ఒత్తిడికి గురికావల్సి వస్తోందని ఇందిర తెలిపింది. ఒక్క ఇందిరే కాదు విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న ఏ ఒక్కరిని కదిపినా ఇదే మాట వినిపిస్తోంది.

విశాఖ విద్య : మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే అని గొప్పలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ మాత్రం ప్రకటించలేదు. ఈ నెల 6న నోటిఫికేషన్ జారీచేస్తారని అంతా అనుకున్నా మళ్లీ వాయిదా పడింది. ఇంతకీ ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందో..? లేదోనన్న సందేహాలు కలుగుతున్నాయి. టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డీఎస్సీ కోసం రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు. కొంతమంది ప్రైవేటు స్కూళ్లలో చేస్తున్న కొలువు మానేసి.. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నారు. కూటమి ప్రభుత్వం అదిగో, ఇదిగో డీఎస్సీ అంటూ కాలయాపన చేస్తుండటంపై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

ఖాళీల గుర్తింపుపై కానరాని స్పష్టత

మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు 1,134 పోస్టులు భర్తీ చేయనున్నారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారనే క్షేత్ర స్థాయి నివేదికలతో ప్రభుత్వం డైలమాలో పడింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 734 ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు లెక్క తేల్చారు. వీటిలో ఎస్జీటీ పోస్టులు 216 వరకు ఉన్నాయి. దీనిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవటం, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై రోజుకో ప్రకటన చేస్తుండటంపై నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

రోస్టర్ పాయింట్లతో రాద్ధాంతం

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టుల రోస్టర్ పాయింట్ల లెక్క తేల్చాలని ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో రోస్టర్ పాయింట్ల వ్యవహారంతో ఇటీవల జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై కాలయాపన చేస్తున్న నేపథ్యంలోనే తేనెతుట్టెను కదుపుతోందని ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో విలీనమైన సమయంలోనే మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో క్యాడర్ స్ట్రెంత్ వివరాలను స్థిరీకరించాల్సి ఉండగా, అప్పట్లో జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటంతో ఇప్పుడు సమస్యలొచ్చిపడ్డాయి.

టీచర్లకు ప్రమోషన్ల కోత

మెగా డీఎస్సీ మాటేమోకానీ.. ఆ బూచితో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లకు కూటమి ప్రభుత్వం కోతపెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలవారీ ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి ఊసే లేదు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న మున్సిపల్ మేనేజ్‌మెంట్ స్కూళ్లలో అన్ని క్యాడర్లు కలిపి ఇటీవల 11 మందికి ప్రమోషన్లు ఇచ్చారు. డీఎస్సీ కోసం 109 ఖాళీలు చూపించగా.. వీటిలో 30 శాతం కోటా మేరకు ప్రమోషన్లు కల్పించాలి. ఈ విషయంలో జరిగిన తప్పిదాలతో మరోమారు ఖాళీల గుర్తింపుపై రాష్ట్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రోజుకో నిర్ణయం తీసుకుంటుండటంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

ఆశతో ఎదురుచూస్తున్నాం..

డీఎస్సీ ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. పద్మనాభం నుంచి విశాఖ వచ్చి రూమ్ తీసుకొని రాత్రిపగలనకుండా ఎంతో కష్టపడి చదువుతున్నాం. కోచింగ్ కోసం చాలా డబ్బులు ఖర్చు చేశాం. ప్రతీ ఏడాది డీఎస్సీ ప్రకటించి, పోస్టులను భర్తీ చేయాలి. మెగా డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి. – ప్రియాభవానీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ, పద్మనాభం

పసుపునకు ప్రత్యేక బ్రాండింగ్

- కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో పండిస్తున్న కాఫీ మాదిరిగానే పసుపునకు ప్రత్యేక బ్రాండింగ్ తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఉద్యానవనశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సుస్థిర సాధికారతకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో పండించే పసుపులో ఔషధ గుణాలున్నాయని, వాటి శాతాన్ని లెక్కించి అమ్మకాలు చేస్తే రైతులు అధిక ధర పొందేందుకు వీలుంటుందన్నారు. దీనిపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్‌గ్రీన్ సంస్థ రాబోయే రెండు సంవత్సరాల్లో అరకు,పాడేరు,జి.మాడుగుల మండలాల్లోని ఐదు వేల మంది పసుపు రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు నిర్ణయించడం అభినందనీయమని చెప్పారు.గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపులో కర్కుమిన్ పెంచడానికి కృషి చేయాలని చెప్పారు. ఉద్యావనశాఖ జిల్లా అధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 1.50 వేల ఎకరాల్లో కాఫీ, 75వేల ఎకరాల్లో మిరియాలు, 25వేల ఎకరాల్లో పసుపు పండిస్తున్నారన్నారు. ఇప్పటికే కాఫీ, మిరియాలు సాగును పెంచడంతోపాటు మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేక నెట్‌వర్క్ ఉందన్నారు. పసుపునకు ప్రత్యేకమైన మార్కెటింగ్ సదుపాయం లేక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. జిల్లాలోని మూడు మండలాల్లో 5వేల మంది రైతులకు సాగు నుంచి మార్కెటింగ్ వరకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డిజిటల్ గ్రీన్ సంస్థ నిర్ణయించిందన్నారు. డిజిటల్ గ్రీన్ రాష్ట్ర ప్రతినిధి సురేంద్ర మాట్లాడుతూ భూసారం నుంచి మార్కెటింగ్ వరకు అవసరమైన సలహాలు, సూచనలను తమ సంస్థ అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో పసుపులో ఔషధ గుణాలు తెలిపే విధానాన్ని, మట్టి నమూనాలతో భూసారాన్ని లెక్కించడాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి నందు, రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు, డీఆర్‌డీఏ జిల్లా అధికారి మురళి, జిల్లా డాట్ సెంటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, సురేంద్ర, ఉద్యావనశాఖ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ ఎం.జె.అభిషేక్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి, దూసరపాము, లబ్బర్తి, శరభవరం,వాతంగి గ్రామాల్లో కూడా త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా ఈఏడాది ఏడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, వ్యవసాయాధికారి చక్రధర్, సొసైటీ సీఈవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


ఏఎస్సార్ జిల్లా డీఎస్పీ ప్రమోద్, భావన దంపతులను సత్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువాని పాలెం వద్ద గల శ్రీ శాంతి స్వరూపిణీ దుర్గా అమ్మ వారు ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న దానాన్ని పాడేరు డీఎస్పీ కె.ప్రమోద్, భావన దంప తులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లా డుతూ ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారు లకు అన్నదానం చేయడం అభినందనీయమ న్నారు. అన్ని దానాల్లో అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. అంతకుముందు వారు దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా 600 మంది మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ ఏర్పాటుకు చర్యలు

- జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ


తహసీల్దార్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న జేసీ అభిషేక్

కొయ్యూరు: మండల కేంద్రంలో గ్యాస్ గోడౌన్ ఏర్పా టుకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తెలిపారు. కొయ్యూరులో గ్యాస్ గోదామ్ లేక ఇక్కడ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని ఆయన దృష్టికి కొందరు తీసకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ గోడౌన్ కొయ్యూరులో ఏర్పాటు చేసే అంశంపై సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. దీనిపై జీసీసీ అధికారులతో మాట్లాడుతామన్నారు. ఆయన సోమవారం తహశీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వేరే జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్

అనకాపల్లి జిల్లా కృషాదేవిపేటలో ఉన్న మండల స్థాయి నిల్వల(ఎంఎల్ఎస్) పాయింట్‌ను కొయ్యూరు తరలించేందుకు ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు. గతంలో కాకరపాడులో ఉన్న గోడౌన్ నుంచి సరకుల సరఫరా జరిగేదని, ఆ భవ నంలోకి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తరలించేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తామన్నారు.మె కాకర పాడు నుంచి మండలంలో డిపోలకు గతంలో సరకు లను పంపించేవారు. తరువాత పూర్తిగా కృష్ణాదేవిపే టకు మార్చారు..ఇప్పుడు ఆ భవనాన్ని వినియోగం చకపోవంతో ఖాళీగా ఉందన్న సమాచారం తెలుసు కున్న జేసీ అభిషేక్ తదితర పాయింట్‌ను కొయ్యూరు తరలించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ రెవెన్యూ సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్ ,ఆర్ఐలు తదితరులున్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ


అంగన్‌వాడీ సిబ్బందిని విచారిస్తున్న సీడీపీవో విజయగౌరి

చింతూరు: ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి సోమవారం విచారణ నిర్వహించినట్టు సీడీపీవో విజయగౌరి తెలిపారు. ఈ విషయంపై సంబంధిత సూప ర్‌వైజర్‌ను వివరణ కోరగా బిల్లులు చేసేందుకు తాను ఎలాంటి పర్సంటేజీలు అడగలేదని, తనపై పత్రికల్లో వచ్చిన ఆరోపణలు అవాస్తవమని చెప్పినట్టు సీడీపీవో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రా లకు చెల్లించే బిల్లుల సొమ్ములు నేరుగా అంగన్‌వాడీ కార్యకర్తల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. పర్సంటేజీల విషయంపై అంగన్‌వాడీ కార్యకర్తలను విచారణ చేయగా సంబంధిత సూపర్‌వైజర్ తమను ఎలాంటి పర్సంటేజీలు అడగలేదని తెలి పారని సీడీపీవో వివరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులు నివేదించినట్టు ఆమె తెలిపారు.

నృత్య వైభవం


కళాకారుల నృత్య ప్రదర్శన


థింసా నృత్యం

ఏయూక్యాంపస్: భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని విశాఖలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు సోమవారం కూడా కొనసాగాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా మైదానంలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నగరవాసులను అలరించాయి. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు వారి సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పాయి. ఆదివాసీ మహిళలు, విద్యార్థులు గిరిజన సంప్రదా యాలను గుర్తుచేస్తూ చేసిన నృత్యాలు అందరి మనసులను గెలుచుకున్నాయి. థింసా నృత్యం, కొమ్ము నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఏకరూప దుస్తులు ధరించి చేసిన నృత్యాలు ఆదివాసీ జీవన వైవిధ్యతను చాటి చెప్పాయి.

అధికారులు ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులందరూ ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావే శానికి ఎమ్మెల్యే మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు నిరం తరం ప్రజా శ్రేయస్సుకోసం కృషి చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు. అధికారులంతా ప్రజా ప్రతినిధులతో సమన్వయం తో పనిచేయాలని, అప్పుడే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. మండలంలో గిరిజ నుల భూములు గిరిజనేతరుల చేతికి వెళ్తున్నా యని, ఇందుకు అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తు న్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములను అధికారులు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. చట్టాలను అతిక్రమిం చిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మత్స్యలింగంకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పుష్ప గుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన సర్వసభ సమావే శంలో జెట్పీటీసీ దీసరి గంగారాజు, ఎంపీడీఓ కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

30న పింఛన్ల పంపిణీ

సాక్షి,పాడేరు: డిసెంబర్ 1వతేది ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం పింఛన్లను జిల్లాలో పం పిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలి పారు. ఈనెల 29వతేది లోపు సంబంధిత మండల అధికారులు పింఛన్ మొత్తాలను డ్రా చేసి, 30న పం పిణీకి సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. తూర్పు–పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు గుర్తింపు కార్డులు లేని వారు ఎన్నికల కమీషన్ గుర్తించిన ప్రత్యా మ్నాయ గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియో గించుకోవచ్చని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ప్రకట నలో తెలిపారు. సాధా రణ ఎన్నికల నిబంధనలు ఈ ఎన్నికలకు వర్తిస్తాయన్నారు. గుర్తింపు కార్డులు లేని వారు ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డుల ద్వారా ఓటు హక్కు వినియోగిం చుకోవాలని సూచించారు.

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట నిరసన


రంపచోడవరం: జిల్లాలో ఆదివాసీ చట్టాలను పటి ష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరి షత్ రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆరోపిం చారు. ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అడ్డతీగల మండలం దుప్పులపాలెం గ్రామంలో అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్నారని చెప్పారు. వారం రోజుల క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. చట్టాలు అమలు చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షురాలు బొరగ ఎర్రమ్మ తదతరులు పాల్గొన్నారు.

చకచకా సుందరీకరణ పనులు

- కొత్తపల్లి జలపాతానికి కొత్త సొబగులు


జలపాతం వద్ద బండ రాళ్లపై ప్రత్యేక ఆకర్షణగా బొమ్మలు


కొత్తపల్లి జలపాతం వద్ద పార్కింగ్ ప్రాంతంలో నిర్మిస్తున్న రోడ్డు


జలపాతం వద్ద రంగుల విద్యుత్ కాంతుల నడుమ నీటి ప్రవాహం

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద సుందరీక రణ పనులు చకచకా జరుగుతున్నాయి. పర్యాట కులను మరింత ఆకర్షిణీయంగా ఉండే విధంగా తీర్చిదిద్దే పనులు వేగవంతం చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషక్ ప్రత్యేక దృష్టి సారించి ఎప్ప టికప్పుడు పనులు పురోగతిని సమీక్షిస్తున్నారు. కొత్తపల్లి జలపాతం వద్ద పంచాయతీ రాజ్ శాఖ, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ శాఖల అధ్వర్యంలో సుమారు రూ.1.30కోట్లతో ప్రధాన రహదారి నుం చి పార్కింగ్ ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రైన్, ఫ్లోరింగ్ టైల్స్, ఫెన్సింగ్, పేయింటింగ్స్ ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు.ఎల్ఈడీ, జిగ్‌జాగ్ లైన్స్ వంటి విద్యుదీకరణ పనులు చేపడుతున్నారు. జలపాతం వద్ద వ్యూపాయింట్, టికెట్ కౌంటర్. ఇతర పనులు చేస్తున్నారు. ఆయా పనులతో కొత్త పల్లి జలపాతం కొత్త అందాలు సంతరించుకుంటు న్నాయి. ఇక్కడకు వచ్చే పర్యాటకులు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులు రాత్రిళ్లు బస చేసేందుకు కూడా ప్రయివేటు కాటే జీలు అందుబాటులోనికి వచ్చాయి.

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి అందరి సహకారం అవసరం

- కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్ , పక్కన ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, జేసీ అభిషేక్,

పాడేరు : జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ చైర్మన్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వ మిత్ర అధ్యక్షతన సోమవారం స్థానిక ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వలు, రోగులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై నిర్వా హకులను అడిగి తెలుసుకున్నారు. ఎంతో అత్యవస రమైతే తప్ప రోగులకు మైదాన ప్రాంత ఆస్పత్రు లకు తరలించవద్దని చెప్పారు. రోగులకు చికిత్స చేయడంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పాడేరు ఎమ్మెల్యే, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ కో కన్ వ్వనర్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న పాడేరు సర్వజన ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా ఆస్పత్రిగా మార్పు చేశారన్నారు. జిల్లా అస్పత్రికి అదనంగా అంబులెన్స్‌లను సమ కూర్చాలని కోరారు కార్యక్రమంలో జాయింట్ కలె క్టర్ అభిషేక్ గౌడ, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలిం గం, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమా ల్‌బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు, జిల్లా ఆస్పత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ తమర్భ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమాతో రైతులకు మేలు


కొయ్యూరులో మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి


ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్లాంటేషన్ డీజీఎం ప్రకాష్

కొయ్యూరు: మండలంలోని రావణాపల్లిలో మండల వ్యవసాధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ బీమాలో చేరాలని సూచించారు. ప్రమాద బీమా వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభించినపుడు నష్ట పరిహారం అందు తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను(ఎ ఫ్‌పీజీ)లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవా లన్నారు. ఈ పంట నమోదును వేగవంతం చేయాల న్నారు.దీనిలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

గంగవరం :ఆయిల్ పామ్ సాగు విస్తరణ అధిక దిగు బడులు సాధించవచ్చునని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్లాంటేషన్ డీజీఎం ప్రకాష్ అన్నారు. సోమవారం మోహనాపురం గ్రామ రైతు సేవా కేంద్రం ఆవర ణలో పెదాదపురం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ , ఉద్యా నవనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో పాల్గొన్న పతంజలి మాట్లా డుతూ ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం, అధిక దిగుబడులపై అవగాహన కల్పించారు. డ్రిప్ ఇరి గేషన్ జిల్లా అధికారి ఎండీ రహీమ్ మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ వివరాలను నీటి యజమాన్య పద్ధతులు వివరించారు . సీనియర్ ఆఫీసర్ శ్రీనివాస్ , ఫీల్డ్ ఆఫీసర్ ఓ.కార్తీక్ రెడ్డి, రాజు క్లస్టర్ ఇంచార్జీ ఉమామహేశ్వరరావు , సూపర్ వైజర్ అప్పారావు , రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు


ఆలయంలో భక్తులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: రంపచోడవరంలోని నారాయణగిరిపై ద్వారకా తిరుమల దత్తత దేవస్థానం దేవాలయంలో సోమవారం వీర వెంకట సత్యనా రాయణ స్వామి వారి సామూహిక వ్రతాలు జరిగాయి. ఆలయ ఈఓ వెం కట సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు అద్దంకి వీరవెంకట సత్యనారాయణ స్వామి భక్తులతో జరిపిం చారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సిం హాచలం సతీ సమేతంగా పాల్గొన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర గౌరీ పరమేశ్వరుల జాతర సందర్భంగా అన్నసమా రాధన, సంత మార్కెట్ వద్ద దేవీగుడి సెంటర్‌లో, రంప రోడ్డులో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గం సభ్యుడు నల్లిమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు.

పాములతో అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న స్నేక్ క్యాచర్ వెంకట్

రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠ శాలలో విద్యార్థులకు పాము కాటు, వివిధ రకాల పాములపై సోమవారం అవగాహన స్నేక్ క్యాచర్ వెంకట్ కల్పించారు. పాములతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాముకాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డబ్ల్యూ యూసీ టీఆర్ఈ స్వచ్ఛంద సంస్థ, మద్రాసు క్రొకోడైల్ బ్యాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాముకాటుకు గురైన వారు తీసు కోవాల్సిన చికిత్సలను వివరించారు. ఇంటి పరిస రాలు, ఇళ్లలోకి పాములు రాకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

శివారు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి కృషి

- జర్రెలపోదర్ గ్రామానికి కాలినడకన వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు


జర్రెలపోదర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు


కాలినడకన జర్రెలపోదర్ వెళ్తున్న నేతలు

ముంచంగిపుట్టు:మండలంలో గల రంగబయలు పంచాయతీ జర్రెలపోదర్ గ్రామానికి రహదారి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా జరిగే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు అన్నారు.సోమవారం అత్యంత మారుమూల జర్రె లపోదర్ గ్రామానికి జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదే శాల మేరకు మండల వైఎస్సార్‌సీపీ నేతలు కొండలు,గుట్టలు ఎక్కి 5కిలో మీటర్ల కాలినడకన అతి కష్టం మీద వెళ్లారు .గ్రామ గిరిజనులు మాట్లాడి రహదారి లేక పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జన్‌మన్ పథకం ద్వారా గృ హాలు మంజూరయ్యాయన్నారు. ఇసుక, సిమెంట్, ఇటుకలు వంటివి తీసుకురావడానికి సరైన రహదారికి లేక శ్రమదానం తో మట్టి రోడ్డు నిర్మించడం జరిగిందని జర్రెలపోదర్ గ్రామ స్తులు వైఎస్సార్‌సీపీ నేతలకు తెలియజేశారు. గతంలోనే వైఎ స్సార్‌సీపీ ప్రభుత్వంలోనే హయంలోనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని,అడవీ శాఖ,పం చాయితీ రాజ్ అధికారుల సమన్వయం లోపంతోనే రహదారికి అడ్డంకులు నెలకొన్నాయని ,జిల్లా స్థాయి అధికారులతో జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడడం జరుగుతుందని, త్వరలోనే రహదారి నిర్మాణం మొదులు అయ్యేలా చర్యలు తీసుకుంటామని వైఎ స్సార్‌సీపీ నేతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైఎ స్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రమేష్,వైఎస్సార్‌సీపీ మండల నేతలు మూర్తి,తిరుపతి, దేవ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి


అరకులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత శ్రీను

- గురుకుల కాంట్రక్ట్, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ర్యాలీ


డుంబ్రిగుడలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

అరకులోయటౌన్: గురుకులం పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రక్టు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యా యులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అరకులోయ పట్ట ణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను మాట్లాడుతూ 2022 పీఆర్‌సీ వెంటనే విడుదల చేయాలని, గురుకులాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనం చెల్లించాలని కోరారు.

డుంబ్రిగుడ: గురుకుల పాఠశాలల్లో కాంట్రాక్ట్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని మాజీ ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం డుంబ్రిగుడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న గురుకుల ఉపాధ్యాయు లను సీనియార్టీ ఆధారంగా రెగ్యులర్ చేయాల న్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీలుగా పనిచేసిన వారిని గత ప్రభుత్వ హయాం లో రెగ్యులర్ చేశారని గుర్తుచేశారు. నేతలు అప్ప లరాజు, శ్రీను, పోతురాజు, లక్ష్మయ్య, తీలి తదిత రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో అరకులోయ బాలికల ప్రతిభ


పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఐశ్వర్య, దేదివ్యలతో పీడీ సూరిబాబు

అరకులోయటౌన్: రాష్ట్రస్థాయి స్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అరకులోయలోని కంఠబౌంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు ప్రతిభ కనబ రిచారు. విజయవాడ పడమటలోని ఈనెల 24న జరిగిన రాష్ట్ర స్థాయి స్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో 53కిలోల విభాగంలో పాఠశాలకు చెందిన సొనాయి ఐశ్వర్య ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ సాంగి సూరిబాబు నిర్వాహకుడు తెలిపారు.

పోటీల్లో 45 కేజీల విభాగంలో ఎస్. దేదివ్య ద్వి తీయ స్థానం సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్రం లోని 26 జిల్లాల నుంచి అండర్ 11, 14, 17, 19 విభాగాల్లో మొత్తం 600 మంది బాల, బాలికలు పాల్గొన్నట్లు పీడీ సాంగి సూరిబాబు తెలిపారు. స్వే మార్షల్ ఆర్ట్స్ ప్రెసిడెంట్ ఇమ్మానుయేల్, కార్యదర్శి ఇబ్రహీం ఆధ్వర్యంలో పోటీలు నిర్వ హించి, విజేతలకు మెడల్, ధ్రువపత్రాలు అందిం చారు. పాడేరు జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో సొనాయి ఐశ్వర్య ప్రథమ స్థానం, ఎస్. దేదివ్య ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై న విషయాన్ని పీడి గుర్తు చేశారు. పాఠశాల హెచ్ ఎం తాంగుల మోహనరావు, పీడీ సూరిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.